
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
బుధవారం 20 మార్చి 2024



చిరువ్యాపారులను పక్కదోవ పట్టిస్తున్న నాయకులు 8లో..

లక్ష్యాన్ని సాధించేలా సమన్వయంతో పనిచేయాలి





'క్రమబద్ధీకరణ' పూర్తయ్యేనా?

- నెలాఖరులోపు పూర్తిచేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- సిబ్బంది కొరత, పార్లమెంట్ ఎన్నికలతో ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎలాంటి లేఅవుట్ అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరణను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సిబ్బంది కొరతతో పాటు ఎన్నికల కోడ్ రావడంతో గడువులోగా పూర్తి అవుతుందో, కాదోనని అధికారుల్లో సందిగ్ధత నెలకొన్నది. ఈ ప్రక్రియలో నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది, మునిసిపల్ బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు, చైన్‌మెన్లు ఎంతో కీలకం. అయితే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో అంతంత మాత్రంగానే ఉన్నారు. దీంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలల్లో అందిన దరఖాస్తులను లోతుగా పరిశీలించి క్షేత్రస్థాయిలో తనఖీలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలంటే అయిదారు నెలలు పడుతుందని మున్సిపల్ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ఈ క్రమంలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆ పనులను చేపడుతూనే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఈ నెలాఖరులోపు ఎలా పూర్తి చేసేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎల్ఎర్ఎస్ ప్రక్రియ పూర్తిచేయడం అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు డీటీసీపీ (డిస్ట్రిక్ట్ టౌన్ కంట్రీ ప్లానింగ్) అనమతులు లేకుండానే వెంచర్లు చేసి ప్లాట్లను విక్రయించారు. అనుమతులు ఉన్నాయా, లేవా అని తెలుసుకోకుండానే అనేక మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. ఈ ప్లాట్లలో నిర్మాణాలు చేయలేని పరిస్థితి. దీనిని దృష్టిలో పెట్టుకున్న గత ప్రభుత్వం 2020లో ఎస్ఆర్ఎస్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

● జిల్లాలో 19,178 దరఖాస్తులు..

ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 19,178 దరఖాస్తులు రాగా, పెద్దపల్లి మున్సిపాలిటీలో 9,675 దరఖాస్తులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 7,078 దరఖాస్తులు, సుల్తానాబాద్ మున్సిపాలిటీలో 1,531 దరఖాస్తులు, మంథని మున్సిపాలిటీలో 894 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 5,929 దరఖాస్తులను పరిశీలించగా, 185 దరఖాస్తులను తిరస్కరించారు. 3,212 దరఖాస్తులను ఫీజు చెల్లించేందుకు అనుమతించారు. 3,212, ఫీజు చెల్లించి ప్రొసీడింగ్స్ పొందినవి 33, ప్రభుత్వానికి 27,70,331 రూపాయల ఆదాయం వచ్చింది. ఇక దరఖాస్తు సమయంలో ఒక్కో ప్లాట్కు రూ.1000 చొప్పున డిపాజిట్ చెల్లించారు. వివిధ కారణాలతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నిలిచి పోయింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. గతనెల 22న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పెండింగ్‌లో ఉన్న ఎల్అర్ఎస్ దరఖాస్తులను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని వెల్లడించారు. దాంతో మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడగా. గతనెల 26న ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేసింది. దేవాదాయ, వక్ఫ్‌బోర్డు, ప్రభుత్వ, కోర్టు పరిధిలో ఉన్న భూములను మినహాయించి ఈనెల 31 వరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను చేయాలని అధికారులను ఆదేశించింది.

● మున్సిపాలిటీలకు పెరగనున్న ఆదాయం..



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో నేరుగా ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. దరఖాస్తుదారు వంద గజాలలోపు స్థలం రెగ్యులరైజ్ చేసుకుంటే మున్సిపాలిటీకి ప్రాంతాన్ని బట్టి ఒక్కో దరఖాస్తు ద్వారా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం సమకూరుతుంది. బహిరంగ మార్కెట్లో స్థలానికి ఉన్న డిమాండును బట్టి ఈ విలువ ఇంకా పెరిగి మునిసిపాలిటీలకు మరింత ఆదాయం సమకూరుతుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెట్ విలువలో 14 శాతం వసూలు చేయనున్నది. చాలా పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండడంతో ఆయా మున్సిపాలిటీలకు క్రమబద్ధీకరణతో వందల కోట్ల రూపాయల్లో ఆదాయం సమకూరనుంది. పట్టణాల్లో వెంచర్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు నిబంధనల మేరకు 10 శాతం స్థలాన్ని ప్రజోపయోగం కోసం మున్సిపాలిటీలకు అప్పగించాలి. ఇది చాలా చోట్ల అమలు కాలేదు. దీనికి తోడు నిర్దేశించిన వెడల్పులో రోడ్లు లేకపోవడంతో వెంచర్లలో ఇళ్ల అనుమతులు ఇవ్వడం లేదు. ఎల్ఆర్ఎస్‌పై తాజాగా ప్రభుత్వం ప్రకటన చేయడంతో అధికారులు ఎస్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ముమ్మరం చేస్తున్నారు. అయితే ఈ నెలాఖరు వరకు పూర్తయ్యే అవకాశాలు కనబడడం లేదు. ప్రభుత్వం స్పందించి మరో రెండు, మూడు మాసాల వరకు గడువు పెంచితే తప్ప పూర్తికావనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

జాతీయ రహదారి నిర్మాణానికి
భూసర్వే ప్రక్రియ పూర్తి చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్-మంచిర్యాల మధ్య గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టేందుకు సర్వే నిర్వహించి శనివారంలోగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి భూసేకరణ సర్వే ప్రతిపాదనల రూపకల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ వరంగల్-మంచిర్యాల మధ్య గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి కోసం పెద్దపల్లి జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో అవసరమైన భూ సేకరణ చేపట్టేందుకు సర్వే చేసి ప్రతిపాదనలను తయారుచేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్లు, భవనాల శాఖ, అటవీశాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ ఇంట్రా, ఉద్యానవన శాఖ అధికారులు జాతీయరహదారి నిర్మించడం వల్ల ఆయా శాఖల పరిధిలో కలిగే నష్టాలకు, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, అదేవిధంగా సేకరించాల్సిన భూమి, రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం తదితర అంశాలపై సంపూర్ణ నివేదిక రూపొందించాలని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణకు సంబంధించి భూసర్వేను అధికారులు కట్టుదిట్టంగా పూర్తిచేయాలని, భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు తప్పనిసరిగా నష్టపరిహారం అందుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించే పరిహారంపై రైతులకు సంతృప్తి కలగని నేపథ్యంలో వారు అప్పీలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పిస్తూ భూసర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని ఆర్డీవో హనుమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లికల్చరల్, మార్చి 19 : జిల్లాలో పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అదనపుకలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ తెలిపారు. మంగళవారం ఆయన ఎన్టీపీసీలోని సెయింట్ క్లైర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్ అనుమతి లేదని, ఎట్టి పరిస్థితులలో ఎవరు కూడా సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లకుండా పకడ్బందీగా చెక్‌చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 45 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షలో 7712 మంది విద్యార్థులకు 7705 మంది విద్యార్థులు హాజరుకాగా, 99.9 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, మంగళవారం 3ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 పరీక్ష కేంద్రాలను, జిల్లాస్థాయి పరిశీలకులు 6 పరీక్ష కేంద్రాలను, డీఈవో 7 పరీక్షా కేంద్రాలను సందర్శించారని, మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

ఇండ్లపై నుంచే విమానం చక్కర్లు

- వారం రోజులుగా తిరుగుతున్న జెట్ విమానం



గాల్లో చక్కర్లు కొడుతున్న విమానం

ముత్తారం, మార్చి 19 : మండలంలో వారం రోజులుగా ఇళ్లపై నుంచి విమానం చక్కర్లు కొడుతోంది. దీంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ బస్‌లు కూడా రాని మారుమూల ప్రాంతాల్లో జెట్ విమానం చక్కర్లు కొడుతుండటంతో చూసిన జనం ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై అధికారుల వద్ద కూడా ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. మంగళవారం ఉదయం కూడా జెట్ విమానం భారీ శబ్దం చేసుకుంటూ ఇళ్లకు అతి సమీపంలో చక్కర్లు కొట్టడంతో పోలీస్ అధికారులు అప్రమత్తమై సమాచారం సేకరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

మానేరు వాగుపై అక్రమ వసూళ్లపై కొరడా

- అక్రమంగా వేసిన రోడ్డు సీజ్



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ముత్తారం, మార్చి 19 : మండలంలోని ఓడెడు వాగుపై ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి ద్వారా రోడ్డును ఏర్పాటుచేసి వాహనదారుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై అధికారులు కొరడా ఝులిపించారు. మూడు నెలలుగా కొంతమంది మానేరు వాగులో అక్రమంగా రోడ్డు వేయడమే కాకుండా దానికి చెక్‌పోస్ట్ ఏర్పాటుచేసి, వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. అక్రమంగా రోడ్డును ఏర్పాటు చేసిన వారు ప్రతిరోజు సుమారు లక్ష వరకు ఎలాంటి అనుమతులు లేకుండానే వసూలు చేస్తుండటంతో వాహనదారులు పలు విధాలుగా ఆరోపణలు చేయగా రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం ముత్తారం తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో లలిత, ఎస్ఐ మధుసూధన్‌రావు, ఐబీ జేఈ రఫీలు మానేరు వాగుపై నిర్మించిన రోడ్డును తొలగించడంతో పాటు రోడ్డును సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా అక్రమ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత కొన్ని రోజులుగా మానేరు వాగుపై మట్టిని పోసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పత్రికల్లో వార్తలు రావడంతో పాటు ఫిర్యాదు కూడా అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భవాని, పంచాయతీ కార్యదర్శి స్వప్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీ యజమానుల సంక్షేమం కోసం కృషి..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 19: రామగుండం లారీ యజమానుల సంక్షేమం కోసం కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం స్థానిక గంగానగర్‌లోని లారీ అసోసియేషన్‌లో ఎమ్మెల్యేను లారీ యజమానుల సంఘం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది లారీ ఓటర్లు ఫైనాన్స్‌లతో లారీలను కొనుగోలు చేశారని, సరిగా లోడింగ్, అన్‌లోడింగ్ దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించడానికి సింగరేణి యాజమాన్యం, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంతో మాట్లాడి లోడింగ్ పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం అందించే పథకాలను లారీ ఓనర్లకు అందే విధంగా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. లారీ యజమానులు ధైర్యంగా ఉండాలని, అధైర్యపడవద్దని, వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, లారీఅసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాండు రంగారావు పాల్గొన్నారు.

కమిటీ నియామకం

కళ్యాణ్‌నగర్, మార్చి 19: మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం రామగుండం కార్పొరేషన్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల కార్యనిర్వహణ కమిటీని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కార్యనిర్వహణ కమిటీ సభ్యుడిగా కార్పొరేటర్ బొంతల రాజేష్, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, రామగుండం కార్పొరేషన్ బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రామగుండంలో అక్రమ దందాలపై ఉక్కుపాదం..

- సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 19: అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, కొన్ని రోజులుగా వరుస దాడులు నిర్వహిస్తున్నట్టు రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కమిషరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తున్నామని, ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం అమ్మకాలపై దృష్టి పెట్టామని, ఇప్పటికే ఆరు కేసులు నమోదు చేశామన్నారు. ఆయిల్ డిపోల నుంచి అక్రమంగా డీజిల్ దొంగిలించిన కేసు దర్యాప్తు జరుగుతోందని, బాధ్యులను ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వం వద్ద ధాన్యం తీసుకుని సీఎంఆర్ ఇవ్వకుండా రూ.7కోట్ల ప్రభుత్వ ధనాన్ని కాజేసిన కేసు రెండు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేశామన్నారు. రూ.50వేలకు మించి నగదును వెంట తీసుకెళ్లరాదన్నారు. శుభకార్యాలకు నగదు తీసుకెళితే డబ్బు ఎవరి వద్ద సేకరించారనే విషయంపై రశీదులు ఉండా లన్నారు.

'కంపెనీ'ల ఆధ్వర్యంలో పేకాట

- మంచిర్యాల జిల్లా చెన్నూరు శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి
- 10మంది అరెస్ట్ - రూ.14.48లక్షల నగదు స్వాధీనం
- గోవా క్యాసినో స్థాయిలో చిప్స్ చెలామణి - నిర్వాహకులపై పీడీ యాక్టు
- వివరాలు వెల్లడించిన రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



చిప్‌ను చూపిస్తున్న సీపీ శ్రీనివాస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

కోల్‌సిటీ, మార్చి 19: గోవా క్యాసినో స్థాయిలో పేకాట జూదాన్ని విస్తరించేందుకు నిర్వాహకులు కొత్త ఎత్తులు వేశారు. ముగ్గురు నలుగురు నిర్వాహకులు కలిసి 'కంపెనీ'గా ఏర్పాటు చేసుకున్నారు. రూ.5లక్షల నుంచి రూ.10లక్షల పెట్టుబడితో కంపెనీ ప్రారంభించి పేకాట జూదాన్ని నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పరిసరాలే కేంద్రంగా ఈ పేకాట కంపెనీలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. పోలీసులకు సమాచారం చేరకుండా కట్టుదిట్టమైన సమాచార నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకుని మూడు ముక్కల ఆటను ఆడిస్తూ లక్షలు దండుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు సమీపంలోని అస్నాద్ గ్రామ శివారులోని మామిడి తోటలో అన్నాల తిరుపతి, సందెల తిరుపతి, చోటు ఆధ్వర్యంలో జరుగుతున్న పేకాట కంపెనీపై మంగళవారం పెద్దపల్లి జిల్లా రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. రూ.14.48లక్షల నగదును స్వాధీనం చేసుకోవడంతో పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం రాత్రి రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ అరెస్టు వివరాలను వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో అక్రమదందాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, దీనిలో భాగంగా ఇటీవల పేకాట శిబిరాలపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ సీఐ సంజయ్ ఆధ్వర్యంలో మంచిర్యాల చెన్నూర్ సమీపంలోని అస్నాద్ గ్రామ శివారులోని మామిడి తోటలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో రూ.14.48లక్షల నగదు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, మూడు ముక్కల పేకాట ఆడుతున్న మంచిర్యాలకు చెందిన ఇద్దరు, గోదావరిఖనికి చెందిన ఇద్దరితో పాటు వరంగల్, పెద్దపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన పది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నామని, మరికొందరు పారిపోయారన్నారు.

● గోవా తరహాలో చిప్స్ వినియోగం..

కంపెనీల పేర నిర్వహిస్తున్న పేకాట దందాలో నిర్వాహకులు భారీ నెట్‌వర్క్‌ను ఒక్కో కంపెనీకి 10నుంచి 20మంది ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు. వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి పేకాటరా యుళ్లను తీసుకువస్తారన్నారు. ఇందుకు వాహనాలు ఏర్పాటుచేసి పేకాట స్థావరాలకు కిలోమీటర్ల దూరంలో దించుతారు. అక్కడినుంచి ద్విచక్ర వాహనాల ద్వారా జూదర్లను స్థావరాలకు చేర్చుతారన్నారు. కంపెనీ నిర్వాహకులు ఈ పేకాటలో చిప్స్ విధానాలను వినియోగంలోకి తెచ్చారన్నారు. రూ.1000, రూ.2500, రూ.5000 చిప్స్‌లను డబ్బులు ఇచ్చి జూదర్లు కంపెనీ నిర్వాహకుల వద్ద కొనుగోలు చేయాల్సి ఉంటుందని, ఆట పూర్తయిన తరువాత తమ వద్ద ఉన్న చిప్స్‌ను వారికి ఇచ్చిన తిరిగి నగదుగా మార్చుకుంటారన్నారు. తమ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సాధారణ గ్రామస్తుల్లా అనుమానం రాకుండా వెళ్లారని, వారి ఇన్‌ఫార్మర్ వ్యవస్థ కంటపడకుండా పేకాట స్థావరంపై దాడి చేసినట్టు సీపీ శ్రీనివాస్ తెలిపారు. అధికారులు, సిబ్బందికి రివార్డులు అందిస్తామని సీపీ తెలిపారు.

ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తాం..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, మార్చి 19: రామగుండంలో మార్పు మొదలైందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో పాటు మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఆయా విభాగాల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, కాంగ్రెస్‌పై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, దశాబ్దకాలం తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. రామగుండంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పరిపాలన కొనసాగిస్తామన్నారు. పార్టీలో కష్టపడిన నాయకులకు స్థానం ఉంటుందని, ఎవరూ కూడా నిరాశ చెందవద్దని అన్నారు. రామగుండం కార్పొరేషన్‌లో ప్రజలకు మౌలిక సదుపాయాలు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి విద్యుత్ సమస్యలను తీర్చడమే ఎజెండాగా పెట్టుకున్నట్టు చెప్పారు. రామగుండానికి టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.100కోట్లు, డీఎంఎఫ్టీ నుంచి రూ.10కోట్లు, స్పెషల్ ఫండ్ కింద రూ.2కోట్లు తీసుకువచ్చామన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మేయర్ బంగి అనీల్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని, కొలిపాక సుజాత, కల్వల శిరీష, జెట్టి జ్యోతి, నీల పద్మ, గణముక్కుల మహాలక్ష్మి, దాతు శ్రీనివాస్, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, ఫజల్ బేగ్, పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, గుండేటి రాజేష్, దూళికట్ట సతీష్, దాసరి సాంబమూర్తి, దాసరి ఉమ పాల్గొన్నారు.



మహిళా కండక్టర్‌పై దాడి.. పోలీసులకు అప్పగింత

కోరుట్ల, మార్చి 19: మద్యం మత్తులో ఆర్టీసీ బస్సులోని మహిళా కండక్టర్‌పై ఓ ప్రయాణికుడు దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం కోరుట్లలో జరిగింది. వేములవాడ డిపోకు చెందిన బస్సు కోరుట్ల బస్‌స్టాండ్ నుంచి వేములవాడకు వెలుతుంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రయాణికులతో పాటు బస్సు ఎక్కాడు. పట్టణంలోని నందీ చౌరస్తా ప్రాంతానికి చెరుకోగా మద్యం తాగి ఉన్న వ్యక్తి బస్సు కండక్టర్ టికెట్ విషయంపై ప్రశ్నించగా సదరు వ్యక్తి కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించాడు. దీంతో డ్రైవర్ అప్రమత్తమై పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి బస్సును తీసుకపోయి అతనిని పోలీసులకు అప్పగించారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 19: మహిళపై దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దీటి తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని దీటి లక్ష్మికి ఆమె బావ శ్రీనివాస్‌తో కొంతకాలంగా ఇంటి పంపకం విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో శ్రీనివాస్ కొడుకు తిరుపతి ఈ నెల 18న రాత్రి లక్ష్మీ ఇంటికి చేరుకొని గొడవకు దిగాడని చెప్పారు. అంతటితో ఆగని అతడు లక్ష్మిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఇంటి సమీపంలో ఉన్న పశుగ్రాసాన్ని దహనం చేశాడని తెలిపారు. బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

జనశక్తి నక్సలైట్ పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కోనరావుపేట, మార్చి 19: జనశక్తి నక్సలైట్ పేరుతో ప్రజలను భయపెడుతూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన చెన్నమనేని పురుషోత్తమరావు ప్రభుత్వ నిషేదిత విప్లవ సంస్థ జనశక్తి అరుణోదయ సంస్థలోపనిచేస్తున్నానని అమాయక ప్రజలను బెదిరిస్తూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడని పురుషోత్తమరావును కోనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కుతరలించినట్లు తెలిపారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టే వారి సమాచారం పోలీసులకు అందించాలని అన్నారు.


వడదెబ్బ తగలకుండా ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వెల్గటూర్, మార్చి 19: వేసవికాలంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం వెల్గటూర్, కోటిలింగాల గ్రామాలలో ఉపాధాహామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముందు జాగ్రత్తగా ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణం ప్రాముఖ్యతను వివరించి పాకెట్లు అందజేసినట్లు తెలిపారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. శరీరంపై ఏర్పడే స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.















ప్రమాదవశాత్తు గోడకూలి బాలుడి మృతి

మేడిపల్లి, మార్చి 19: సిమెంట్ గోడకూలి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మేడిపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి శివారులో నిర్మిస్తున్న పౌల్ట్రీఫాంలో మహబూబాబాద్ జిల్లా వొడ్డెర గూడెం గ్రామానికి చెందిన సంపంగి సంగీత, శ్రీను దంపతులు తమ కొడుకు గణేష్(4)ను తీసుకొని కూలీపనులు చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో అదే ఫాంలో పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన అమరగోని రాజు కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో సిమెంట్ గోడ పక్కనే నిద్రిస్తున్న బాలుడిపై గోడ కూలడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పొట్టకూటి కోసం వచ్చి తమ కుమారుడిని కోల్పోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తల్లి సంపంగి సంగీత ఫిర్యాదు మేరకు డ్రైవర్ అమరగోని రాజుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోపాల్‌రావుపేటలో బైక్ చోరీ

రామడుగు, మార్చి 19: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఇనుగుర్తి రఘువీర్ అనే వ్యక్తి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇంటి ముందు పెట్టిన యమహ బైక్‌ను దొంగిలించడంతో బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గత 15 రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనకు గురి అవుతున్నారు. బస్టాండ్ వద్ద రాత్రి వేళల్లో షాపుల తాళాలు పగులకొట్టి నగదు, పరికరాలను ఎత్తుకెళ్లిన సంఘటనలున్నాయి. సీసీ కెమరాలను ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొడిమ్యాల, మార్చి 19: మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన గుడి మల్లారెడ్డి(65)కరీంనగర్ ఆసుపత్రిలో 10 రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. వయస్సు పైబడి, కుటుంబ పోషణ భారమై ఈ నెల 8న జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద మల్లారెడ్డి పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లారెడ్డి భార్య గుడి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

27నుంచి వేములవాడలో శివకల్యాణోత్సవాలు

వేములవాడ, మార్చి 19: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో ఈ నెల 28వ తేదీన శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు శ్రీ శివకల్యాణోత్సవాలు జరుపనున్నారు. ఇందులో భాగంగా 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05 ని.ల నుంచి శ్రీస్వామివారి రథోత్సవము నిర్వహిస్తారు.


శ్రీరాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం

ఐదు రోజులపాటు ఆర్జిత సేవల నిలిపివేత

శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీ స్వామివారి నిత్యకల్యాణం, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకల్యాణోత్సవము సందర్భంగా 28వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు కోడె టికెట్లు జారీ నిలిపివేస్తామని, నిత్య చండి సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వబడవని వెల్లడించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానములో ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజులపాటు డోలోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 23వ తేదీ శనివారం సాయంత్రం ప్రదోష పూజ అనంతరం కామ దహనం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, మార్చి 19: సైదాపూర్ మండలంలో పెర్కపల్లి గ్రామానికి చెందిన పోతరాజు ఓదయ్య(85) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓదయ్య భార్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి ఓదయ్య మతి స్థిమితం ఉండడం లేదు. భార్య చనిపోయిందని ప్రతి రోజు భార్యను తలుచుకుంటూ ఆవేదన చెందేవాడు. మనస్థాపంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి ఓదయ్యను 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఓదయ్య అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి కుమారుడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం,మార్చి 19: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై దావత్ చేసుకుందామని పిలిచి దాడిచేసి అందినకాడికి దోచుకున్న వేములవాడ మండలంలోని చింతల్‌ఠాణాకు చెందిన సూరదేవయ్య, సూర సురేష్‌లను మంగళవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ముక్క శ్రీనివాస్‌కు చింతల్‌ఠాణకు చెందిన సూర దేవయ్యలకు ఫేస్‌బుక్ ద్వారా 15 రోజుల క్రితం పరిచయం ఏర్పడిందన్నారు. ఈ పరిచయమే దావత్ చేసుకోవాలని నిర్ణయించుకోవడంతో బొల్లారం నుంచి చింతల్‌ఠాణకు శ్రీనివాస్ వచ్చాడన్నారు. ఈనెల 17న బాబయ్ దేవయ్య, అబ్బాయ్ సురేష్‌లు ముందుగానే మద్యం సేవించి సిరిసిల్ల పాత బస్టాండ్‌లో తాను బస్సు దిగగానే బైపాస్‌రోడ్డు వద్దకు తీసుకెళ్లి తనపై దాడిచేసి రూ.3 వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నారని బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదుచేసి చంద్రంపేట ఎక్స్ రోడ్డు వద్ద అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు.

అంజన్న టెండర్ సొమ్ముల స్వాహాపై విచారణ

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో టెండర్‌దారులు చెల్లించిన సొమ్ములను ఆలయ అధికారి దేవస్థానం ఖాతాలో జమచేయకుండా స్వాహా చేయడంపై పత్రికల్లో వచ్చిన కథనాలతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కే.జ్యోతి మంగళవారం విచారణ జరిపారు. టెండర్ల విభాగం అధికారి శ్రీనివాసాచారి దాదాపు రూ.37లక్షల మేర సొమ్ములను దుకాణదారుల వద్ద వసూలు చేసి దేవస్థానం పద్దుకు చేర్చకపోవడంతో కొన్నాళ్ల క్రితం ఈ విషయం తీవ్ర దుమారం లేపింది. దీంతో అతన్ని దేవస్థానం అధికారులు సస్పెండ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేశారు. ఇటీవల మరో రూ.11లక్షల వరకు కూడా తేలగా సదరు అధికారి గత 2020 నుంచి 2023 వరకు నిర్వహించిన టెండర్ విభాగంలో జరిగిన ఈ స్వాహా పర్వంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. 2022-23 సంవత్సరంలోనే అధికంగా దాదాపుగా రూ.50లక్షల మేర సొంతానికి వాడుకున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అనంతరం క్యాష్‌బుక్ తదితరవి ఏడీసీ స్వాధీనం చేసుకొని తీసుకెళ్లారు. టెండర్ల లావాదేవీలకు సంబంధించిన బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ తీసుకు రావాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. 2018-19లో ఆడిట్ అధికారులు అనేక అభ్యంతరాలతో కూడిన నివేదిక ఇవ్వగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీసీబీ, సీబీ, ఆడిట్ నివేదికలను కూడా ఏడీసీ తీసుకెళ్లగా విచారణ నివేదికను కమిషనర్‌కు అందించనున్నట్లు ఏడీసీ ఈ సందర్భంగా తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు రుజువు అయితే అందరిపై చర్యలు తప్పవన్నారు. ఈ విచారణలో కరీంనగర్ ఏసీ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్, ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు శ్రీని వాస్‌శర్మ, సునీల్ ఉన్నారు. ఈ విచారణలో మరింత అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని, అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల వారి పాత్రపైనా విచారణ జరిపించాలని డిమాండ్ వినిపిస్తోంది.


పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ జ్యోతి

నెమలిని వేటాడిన వ్యక్తి అరెస్టు

● ప్రధాన నిందితుడు సత్యనారాయణ ఓ డీఎస్పీ తండ్రి
● గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు

పెగడపల్లి, మార్చి 19 : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామ శివారులో సోమవారం రాత్రి నెమలిని వేటాడి చంపిన ఘటనలో వేటగాళ్లను జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీసులు సోమవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేశారు. నెమలి వేటగాళ్లలో ప్రధాన నిందితుడు ములుగు జిల్లాలోని ఓ డీఎస్పీకి తండ్రి కావడం గమనార్హం. ఇతడు గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మంగళవారం పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ రఘచందర్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ (63), జగిత్యాల మండలం మల్యాలకు చెందిన జవ్వాజి రాజు కారు డ్రైవర్‌తో కలసి సోమవారం సాయంత్రం పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో తుపాకీతో నెమలిని వేటాడి చంపారు. దానిని కారులో తీసుకుని వెళ్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు పెగడపల్లి ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి కారును ఆపి తనిఖీ చేశారు. కారులో నెమలి కళేబరంతో పాటు లైసెన్సు లేని తుపాకీ, గొడ్డలి ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నెమలిని వేటాడి తానే చంపినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు. నిందితుడి వద్ద నుంచి 0.22 స్పోర్టింగ్ రైఫిల్ అని రాసి ఉన్న తుపాకీతో పాటు 34 నిండు తూటాలు, ఒక కాల్చిన తూటా, గొడ్డలి, ఏపీ 15 బి 8093 నంబరు గల కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణతోపాటు డ్రైవర్ జవ్వాజి రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘచందర్ తెలిపారు. నిందితుడు సత్యనారాయణ 2017 లో భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతంలో జింకల వేట కేసు లోనూ ప్రధాన నిందితుడని ఇతడికి వన్యప్రాణుల వేట అంటే మక్కువ అని తెలుస్తోందని డీఎస్పీ తెలిపారు.


పెగడపల్లిలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, మార్చి 19 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాతంకు చెందిన ఆల్లేశ్వరం శంకర్ (45) అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ కర్నాటక రాష్ట్రంలోని బెంగళూర్ పట్టణంలో వడ్రంగిగా పనిచేస్తూ జీవించేవాడని అక్కడ ఉన్నప్పుడు అతనికి గుండె సమస్యతో ఆసుపత్రిలో చేరగా వైద్యులు శంకర్‌కు గుండె శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం కోరుట్లకు వచ్చిన శంకర్ పట్టణంలో వడ్రంగి పని చేస్తుండేవాడని తెలిపారు. శంకర్ అవసరాల నిమిత్తం ప్రైవేట్ బ్యాంక్‌లతో పాటు బంధువుల వద్ద అప్పుచేసినట్లు వివరించారు. అప్పులు ఎలా చెల్లించాలని భార్యతో పాటు కుటుంబ సభ్యులకు చెప్పుకుంటూ నిరంతరం బాధపడేవాడని తెలిపారు. గత వారం రోజుల క్రితం బ్యాంక్‌కు చెందిన వారు రుణం చెల్లించాలని ఫోన్ చేయగా అప్పటి నుంచి బాధపడుతూ మంగళవారం వేకువజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాలుపడినట్లు ఎస్‌ఐ తెలిపారు. శంకర్ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

● జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి తీర్పు

వెల్గటూర్, మార్చి 19: మండలంలోని ముత్తునూర్ గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య అనే ఇద్దరు వ్యక్తులకు 2009లో జరిగిన బైరం దామోదర్ హత్య కేసులో జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ముత్తునూర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు బైరం దామోదర్, సింగం రాజయ్య అదే గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, సింగం రాజయ్యలకు పొలం వద్ద నీరు విషయంలో గొడవ జరిగింది. పాత కక్షలను మనసులో పెట్టుకొన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య సహాయంతో 2009 డిసెంబరు 24న సింగం రాజయ్యను చంపాలని అతని పొలం వద్ద మాటు వేశారు. సింగం రాజయ్య పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో అక్కడే ఉన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలు కత్తులతో హత్య చేయాలని వెంబడించగా రాజయ్య గ్రామం వైపు పరుగెత్తాడు. అదే సమయంలో పొలం పనులు ముగించుకొని వెళుతున్న సింగం రాజయ్య స్నేహితుడు బైరం దామోదర్‌ను సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలు కత్తులతో మెడ, పొట్ట భాగంలో పొడవడంతో బైరం దామోదర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దామోదర్ సోదరుడు లచ్చయ్య ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలను కోర్టులో హాజరు పరిచారు. కేసును విచారించిన అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు, రూ.5 వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో అడిషనల్ పీపీ మల్లేశం, ఇన్వెస్టిగేషన్ అధికారులు దామెర నర్సయ్య, సీఎంఎస్ ఎస్‌ఐ రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ ఎం. కిరణ్ కుమార్ నిందితులకు శిక్ష పడడంలో కోర్టుకు సాక్ష్యాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి19: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం(సీఓఈ)లో 2024-25 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జి.దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఓఈలో బాలురకు(80), బాలికలకు(80) సీట్లు ఉన్నట్లు తెలిపారు. ప్రవేశము పొందిన విద్యార్థులకు 9వ తరగతి సిలబస్‌తో పాటు ఐఐటి ఫౌండేషన్ కోర్సు, నీట్ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ ఉచితంగా అన్ని సౌకర్య ములు కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యా ర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, అసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కొరకు ఫోన్.7337349518కు సంబంధిన వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం ముందు భక్తులు

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు అంజన్నతో పాటు శ్రీరాముల వారిని బేతాళుడిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అయితే ఎండల తీవ్రత నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న చలువపందిళ్ల పనులు నత్తనడకన సాగుతుండడంతో భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు.

ఇంటి వద్ద తండ్రి మృతదేహం

● బాధను దిగమింగుకుని పరీక్ష రాసిన అన్నదమ్ములు

పెగడపల్లి, మార్చి 19: విధి పరీక్ష పెట్టినా ధైర్యంగా ఎదుర్కొన్నారు.. ఆ అన్నదమ్ములు. నాన్న చనిపోయాడని తెలిసి అంత్యక్రియలు నిర్వహించాల్సిన సమయం అయినా పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని పదోతరగతి పరీక్ష రాశారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని బతికెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన గాజె రాము, లక్ష్మణ్ కవల పిల్లలు. వీరు పదో తరగతి చదువుతున్నారు. రాము, లక్ష్మణ్ తండ్రి చంద్రయ్య(50) ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆ అన్నదమ్ములు బాధను దిగమింగి మంగళవారం జరిగిన పరీక్షకు హాజరయ్యారు. అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు.


పరీక్ష రాసి బయటకు వస్తున్న రాము, లక్ష్మణ్

మాజీ భర్తపై భార్య యాసిడ్ దాడి

ఇబ్రహీంపట్నం, మార్చి 19: మాజీ భర్తపై ఓ మహిళ యాసిడ్ దాడి చేసిన ఘటన మండలంలోని ఎర్దండి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్దండి గ్రామానికి చెందిన నీరటి మహేష్ మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. కొంత కాలంగా దంపతులకు మనస్పర్థలు రావడంతో 2023లో మహేష్, లక్షణ కోర్టు నుంచి విడాకులు తీసుకున్నారు. మహేష్ మరో యువతిని పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుని ఈ నెల 20న పెళ్లికి సిద్ధం అయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ భార్య లక్షణ మహేష్‌పై కక్ష పెట్టుకుని మంగళవారం మహేష్ ఇంటికి వెళ్లి అతను ఇంటి నుంచి బయటకు రాగానే యాసిడ్‌తో దాడి చేసింది. దీంతో మహేష్‌కు వీపు, ఎడమ కన్నుపై భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. మహేష్ ఫిర్యాదు మేరకు లక్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకులపై ఫిర్యాదు

ధర్మారం, మార్చి19: ధర్మారం చౌరస్తాలో మంగళవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించి ధర్నా చేసిన నాయకులపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు పత్రం అందజేసిన వారిలో దేవిజనార్ధన్, కొడారి హన్మయ్య, చింతల జగన్‌మోహన్‌రెడ్డి, కాడె సూర్యానారాయణ, రూప్లా నాయక్, దేవి లావణ్య తదితరులు ఉన్నారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 19: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన ఎండీ షహజాద్ (17) తండ్రి మందలించాడని మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రంజాన్ మాసం కావడంతో ఉపవాసం ఉండాలని, ఏం తినవద్దని షహజాద్‌ను తండ్రి తాజుద్దీన్ మందలించాడని, దీంతో మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. తండ్రి తాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

జ్యోతినగర్, మార్చి 19 : ఎన్టీపీసీ పీఎస్ పరిధిలోని సాయిసేవా సమితి సమీపంలో గుర్తుతెలియని వృద్ధురాలి(60) మృతదేహాన్ని మంగళవారం పోలీసులు గుర్తించారు. ఎరుపు రంగు టాప్ ధరించి ఉంది. అనారోగ్యంతో చనిపోయి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఎవరైనా వృద్ధురాలి సమాచారం తెలిస్తే ఎన్టీపీసీ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ కోరారు.

ఎన్టీపీసీలో పోలీసుల తనిఖీలు

జ్యోతినగర్, మార్చి 19 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్టీపీసీ పరిధిలో మంగళవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా స్థానికంగా ఉన్న లాడ్జిలలో సోదాలు చేశారు. లాడ్జిలలో రికార్డుల నిర్వహణ రికార్డులను రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్‌లు పరిశీలించారు. అలాగే లాడ్జిలో ఉన్న వారి వివరాలను నమోదు చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా గదులు ఇవ్వకూడదని పోలీసులు నిర్వాహకులకు హెచ్చరించారు.

ఇసుక లారీల పట్టివేత

- ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల బైండోవర్

కాల్వశ్రీరాంపూర్, మార్చి 19: మానేరు నుంచి లారీల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మండలంలోని పెద్ద రాతిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, ట్రాక్టర్ యజమానులను మంగళవారం పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇసుక తరలించేందుకు వచ్చిన మూడు లారీలను పోలీస్‌స్టేషన్ తరలించి ఇసుకను తరలించే వారిని కూడా బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ ఓంకార్ యాదవ్ తెలిపారు. లారీలను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

షాపుల్లో చోరీ

సుల్తానాబాద్, మార్చి 19: సుల్తానాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డుల్లో రెండు షాపుల్లో దొంగతనం జరిగింది. ఈ దొంగతనాలు మంగళవారం వెలుగుచూశాయి. స్వప్నకాలనీ బోర్డుకు ఎదురుగా ఉండే కర్రీ పాయింట్, దాని పక్కనే ఉన్న ఐస్‌క్రీమ్ దుకాణంలో దొంగలు వెనుక నుంచి తలుపులను పగులకొట్టి లోపలకు జొరబడి కౌంటర్లలో ఉన్న దాదాపు ఏడు వేల రూపాయలకు పైగా ఎత్తుకుపోయారని బాధితులు తెలిపారు. అలాగే శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం ఆవరణలో అమ్మవారి ఆలయంలోని విగ్రహం మెడలో ఉన్న రోల్డ్‌గోల్డ్ పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. అయితే ఆలయంలో చప్పుళ్లు విని చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించగా ఒక వ్యక్తిని పట్టుకున్నారు. ఆలయం గోడపక్కన వెతకగా రోల్డ్‌గోల్డ్ నగలు లభించాయి. అతను తరచూ ఆలయం వద్దనే గడిపేవాడని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

ధర్మారంలో వాహనాల తనిఖీ

- రూ.2లక్షల80వేలు స్వాధీనం

ధర్మారం, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ధర్మారంలో రాష్ట్ర రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. దరావత్ ఠాగూర్, లోకవత్ దేవేందర్‌లు సరైన పత్రాలు లేకుండా 55000 నగదును తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా అంజయ్య, కుమార్, మల్లయ్య, అంజయ్య లచ్చయ్యలు వీరి వద్ద కూడ ఎలాంటి పత్రాలు లేకుండా రూ. 2,25,000నగదును పట్టుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. పంచనామా చేసి పట్టుకున్న నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తెలిపారు.

చిరువ్యాపారులను పక్కదోవ పట్టిస్తున్న నాయకులు

- రామగుండానికి పూర్వ వైభవం - రూ.50కోట్లతో వ్యాపార కూడలి అభివృద్ధి - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



వ్యాపార కూడలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, మార్చి 19: రామగుండం అభివృద్ధిపై కొంత మంది నాయకులు చిరు వ్యాపారులను పక్కదోవ పట్టిస్తున్నారని, చిరు వ్యాపారులకు ఎలాంటి నష్టం జరుగకుండా రోడ్డు విస్తరణ పనులను చేయనున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పట్టనున్న హనుమాన్‌నగర్, లక్ష్మీనగర్, మేదరిబస్తీ, శివాజీనగర్, కళ్యాణ్‌నగర్ ఎమ్మెల్యే పర్యటించారు. చిరు వ్యాపారులతో మాట్లాడి వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారాల దుకాణాలు తీసివేస్తారంటూ కొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఇది వాస్తవం కాదని, చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు, సింగరేణికి సంబంధించిన 72క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని తొలగించి రోడ్డు విస్తరణ చేయనున్నట్టు, భాస్కర్‌రావు భవన్ నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తా, శివాజీనగర్, రీగల్ షూమార్ట్, మేదరిబస్తీ, కళ్యాణ్ నగర్, ఉల్లిగడ్డల బజార్, అడ్డగుంటపల్లి చౌరస్తాలోని అబ్దుల్ కలాం విగ్రహం, లక్ష్మీనగర్, పాత మున్సిపల్ ఆఫీస్, లేబర్ కోర్టు వరకు ఈ రోడ్డు విస్తరణ చేయనున్నట్టు చెప్పారు. రూ.50కోట్లతో రామగుండం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు, ఉత్తర తెలంగాణలోనే అత్యధిక వ్యాపారం జరిగే రామగుండం పారిశ్రామిక ప్రాంతం వ్యాపారాలు లేక వెలవెల బోతున్నాయని, ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వ్యాపారాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు, తప్పుడు సమాచారం ఇచ్చే వారిని నమ్మ వద్దని చెప్పారు. ఆయన వెంట మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని, నాయకులు కాల్వ లింగస్వామి, దీటి బాలరాజు, ఉల్లంగుల రమేష్, తిప్పారపు శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, దూళికట్ట సతీష్, గుండేటి రాజేష్, యాద వెంకటరమణ, చిదురాల రవీందర్, దాసరి సాంబమూర్తి ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కోఆప్షన్ సభ్యుడు, నాయకులు

రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులమయంగా మార్చారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ధ్వజమెత్తారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు ఆధ్వర్యంలో కోఆప్షన్ సభ్యుడు చెరుకు బుచ్చిరెడ్డితో పాటు 60మంది బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్లుగా బీఆర్‌ఎస్‌లో కార్యకర్తలకు కూడా న్యాయం జరగలేదని, కాంగ్రెస్ తెలంగాణ ఇస్తే కేసీఆర్ కాంగ్రెస్‌ను కాదని మోసం చేశాడని, ఈ పదేళ్లలో కేసీఆర్ కుటుంబం తప్ప ఇతరులెవరూ బాగుపడలేదని, కాంగ్రెస్ వంద రోజుల పాలనలోనే ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తు న్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గుంపుల ఓదెలు, బెల్లంకొండ రవీందర్, కొలిపాక వీరస్వామి, హమీద్, మొహిద్ సన్ని, కాంపెల్లి సతీష్, దాసరి ఎల్లయ్య, నర్సింగ్ దొర, రాచకొండ కోటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, జిమ్మిడి మల్లేష్, పొగాకుల కొమురయ్య, చుక్కల రాజయ్య, బిక్కినేని నర్సింగరావు, పుల్లా వెంకటేశ్వర్లు, పులి మహేష్, మహ్మద్ హుస్సేన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దీటి బాలరాజు, కాల్వ లింగస్వామి,బొంతల రాజేష్, మహంకాళి స్వామి, నజీమోద్దీన్, తిప్పారపు శ్రీను, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, గడ్డం శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు అందేదెలా?

- పట్టించుకోని అధికారులు - ఆందోళనలో రైతులు



కాలువలో పేరుకుపోయిన ముళ్లపొదలు



అస్తవ్యస్తంగా ఉన్న కాలువ

జూలపల్లి, మార్చి 19. మండలంలోని ఎస్‌ఆర్‌ఎస్పీ సాగునీటి కాలువల్లో చెత్తాచెదారం, ముళ్లపొదలు నిండిపోయాయి. సాగునీటి సరఫరాకు అడ్డంకిగా మారడంతో చివరి ఆయకట్టు భూముల రైతులకు నీరు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని డి83 మెయిన్ కెనాల్ ఉపకాలువ ఎస్సారెస్పీ 9ఆర్ కాలువతో పాటు దాని ఉపకాలువలు పూర్తిగా ముళ్లపొదలతో నిండిపోయి దానికి అడ్డంగా చెత్తాచెదారం చేరడంతో సాగునీరు కింది చివరి ఆయకట్టు రైతులకు అందకపోవడంతో వేసిన మొక్కజొన్నా, మిర్చి, వరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు సాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో అడ్డంకిగా మారిన ముళ్లపొదలు, చెత్తను తొలగించి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని మండల రైతులు సంబంధిత ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వచ్చే ఏప్రిల్ 20 వరకు ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించి పంటలను కాపాడలని మండల రైతులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై దాడికి నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధర్మారం, మార్చి 19: బీఆర్‌ఎస్ నాయకుడు సల్వాజీ మాధవరావుపై కాంగ్రెస్ నాయకుల దాడిని నిరసిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మారం చౌరస్తాలో నిరసన చేపట్టారు. మంగళవారం ఉదయం ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని మండలాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకులు కూడా రోడ్డుపైకి వచ్చారు. తాము కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్తున్నామని నాయకులు పోలీసులకు చెప్పి వెళ్లారు. ఇరు పార్టీల నాయకులు ఆందోళన చేస్తారేమోనని ముందస్తుగా పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ పోలీసులు మొహరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం రాస్తారోకోకు అనుమతి లేదంటూ పోలీసులు చెప్పడంతో బీఆర్‌ఎస్ నాయకులు ప్రధాన చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం దాడి ఘటనపై అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాచూరి శ్రీధర్, రాంచందర్‌గౌడ్, జగన్, మల్లారెడ్డి, మహేష్, గొల్లపల్లి జలందర్, ముత్యాల బలరాంరెడ్డి, పాకాల రాజయ్య, ఆవుల శ్రీనివాస్, దేవి వంశీ కృష్ణ, నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● అట్రాసిటీ కేసు నమోదు

ధర్మారం గ్రామానికి చెందిన సోగాల తిరుపతిని కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన సల్వాజీ మాధవరావుపై ఎస్సీ, ఎస్టీ యాక్టు(అట్రాసిటీ) కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గతంలో వీరిద్దరి మధ్య సోషల్ మీడియా వ్యాఖ్యల విషయంలో గొడవలను దృష్టిలో పెట్టుకుని మాధవరావు కులంపేరుతో దూషించి బెదిరించాడని తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాధవరావుపై ఎస్సీ, ఎస్టీ యాక్టు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా ఇదే విషయంలో సోగాల తిరుపతితోపాటు పలువురు తనను దూషించి, కొట్టారని మాధవరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ట్రినిటి కళాశాలలో ఫేర్‌వెల్ డే



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, మార్చి 19: పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు పలుకుతూ యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ నీతా రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 19: ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు 1500రూపాయల చొప్పున బుక్‌ఫండ్ లేదా స్టడీమెటీరియల్ అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని బీసీ అభ్యర్థులకు టీచర్స్ (ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్) రిక్రూట్‌మెంట్ 2024 (పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న 10వేల మంది బీసీ అభ్యర్థులకు 1500 రూపాయల చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ ఖర్చును అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 040-24071178, 040-27077929 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

సుల్తానాబాద్, మార్చి 19: స్థానిక ఇండియన్ పబ్లిక్‌స్కూల్‌లో బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దంత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలు పోస్టర్లను వారు ఆవిష్కరించారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డెంటల్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మణిదీప్ కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి

-ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిలాష్

పెద్దపల్లిటౌన్, మార్చి 19: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఆర్యవైశ్య భవన్‌లో మంగళవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమా వేశంలో అభిలాష్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి నుండి కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. విద్యార్థుల పక్షాన ఎల్లప్పుడూ పోరాడుతామని అన్నారు.

రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించే యువతకు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భరత్ కుమార్, పెనుకొండ ప్రణయ్, ఈగ ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పిరంగి రాజు, బొంకూరి పవన్, యమ అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి మదాసి శ్రవణ్ రాజ్, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల అధ్యక్షులు కోదాది ప్రశాంత్ రాజ్, కక్కెర్ల సందీప్, మంథని, రామగిరి మండలాల అధ్యక్షులు శైలెందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ టికెట్ గడ్డం వంశీకృష్ణకే ఇవ్వాలి

-మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్

జూలపల్లి, మార్చి 19: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీకృష్ణకే ఇవ్వాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పాటకుల మహేష్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. జూలపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించిన దివంగత వెంకటస్వామి ఈప్రాంతం ప్రజలకు అనేక సేవలను అందించారన్నారు. ఆయన వారసుడు వంశీకృష్ణకు ఎంపీ టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని పాటకుల మహేష్ అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామగిరి, మార్చి 19: రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన గుర్రాల జక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం జడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారయణగౌడ్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంకేషీరవీందర్, నాయకులు కాపురబోయిన బాస్కర్, రాజన్న, గాజుల ప్రసాద్, తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

సుల్తానాబాద్, మార్చి 19: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సుద్దాల మాజీ ఎంపీటీసీ, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సంకెనపల్లి లక్ష్మయ్య జిల్లా కలెక్టర్‌ను కోరారు. సుల్తానాబాద్ లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతు ఈ మేరకు తాను కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించానన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల గ్రామాలలో ఉన్న అంబేద్కర్ విగ్రహాల వద్ద స్పెషల్ ఆఫీసర్ల అధ్వర్యంలో జయంతి వేడుకలు జరిపించాలని ఆయన సూచించారు.

పోషన్ అభియాన్ వారోత్సవాలు

ఎలిగేడు, మార్చి19: మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి అంగన్వాడీ సెంటర్‌లో మంగళవారం పోషన్‌అభియాన్ వారోత్సవాలను నిర్వహించారు. పిల్లలకు అక్షరాభ్యసం, గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణీలు పోషకాహారం తీసుకోవడం వల్ల అనారోగ్యానికి గురికాకుండా ఉండి, కడుపుల్లో పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకళ అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఓదేశ్వరి, ఏఎన్‌ఎం, ఆశాలు, గర్భిణీలు, పిల్లలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 19: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వీర్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వీర్లపల్లెలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కళ్ళు, ఎముకల, చెవి ముక్కు గొంతు స్పెషలిస్టు వైద్యులు సమీప గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి పరికరాలను, దృష్టి లోపం ఉన్నవారికి కళ్ళద్దాలను ఉచితంగా అందజేశారు.

'పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి'

కళ్యాణ్‌నగర్, మార్చి 19: దేశంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందజేసిన ప్రధాని నరేంద్రమోదీని మూడోసారి గెలిపించాలని లబార్థి సంపర్క్ అభియాన్ పార్లమెంట్ కన్వీనర్ మాతంగి రేణుక పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేషన్‌లోని 11వ డివిజన్ సంజయ్‌నగర్‌లో ఇంటింటా కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని పేదలకు, మహిళలు, రైతుల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో సంక్షేమాలు ప్రవేశపెట్టారని అన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన ద్వారా 80కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ, రూ.10కోట్లకు పైగా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, 12కోట్ల మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీని మూడోసారి గెలిపిస్తే దేశం మరిన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, నాయకులు అడ్లూరి రాజేష్, కొలిపాక విజయలక్ష్మి, మామిడి సంపత్, రాజేష్, వేణు, లక్ష్మణ్, సదానందం పాల్గొన్నారు.



లక్ష్యాన్ని సాధించేలా సమన్వయంతో పనిచేయాలి



ఆపరేటర్లకు భోజన ప్యాకెట్లను అందజేస్తున్న జీఎం

యైటింక్లయన్‌కాలనీ, మార్చి 19: ఓసీపీ-1 ప్రాజెక్టుకు కేటాయించిన వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఉద్యోగులకు సూచించారు. ప్రొడక్షన్‌డేలో భాగంగా మంగళవారం క్వారీలో, పని స్థలాల్లో జీఎం పర్యటించారు. ఈసందర్భంగా ఉద్యోగులకు భోజన ప్యాకెట్లను అందజేశారు. ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడం కోసం ప్రొడక్షన్‌డే నిర్వహించినట్టు తెలిపారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఏఐటీయూసీ ప్రతినిధి డీటీ రావు, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి గడ్డం తిరుపతి ఉన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి, మార్చి 19: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్యాభివృద్ధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్, తెలంగాణ స్టేట్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండర్ ఎంటర్‌పెన్యూర్షిప్ సహకారంతో 38వృతి శిక్షణ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వీటికి దరఖాస్తులను ఆహ్వానించడం జరిగిందని పేర్కొన్నారు. ఇట్టి దరఖాస్తుల గడువును పెంచినట్లు పేర్కొన్నారు. ఒక్కోక్క బ్యాచ్‌లో 20 మంది కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలోని 18-42 సంవత్సరాలు ఉన్న యువతి,యువకులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జాతీయ పోటీల్లో రాణించిన కార్మికుడికి సన్మానం



బుగ్గాజీని అభినందిస్తున్న ఓసీపీ-1 ఉద్యోగులు

యైటింక్లయన్‌కాలనీ, మార్చి 19: జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఓసీపీ-1 ఉద్యోగి కండెవాడ బుగ్గాజిని మంగళవారం తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు సన్మానించి అభినందించారు. ఈనెల 9,10 తేదీల్లో కర్ణాటక ఉడిపిలో జరిగిన సైత్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బుగ్గాజి పాల్గొన్నాడు. 5000 మీటర్ల రేస్‌వాక్ 55 సంవత్సరాల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. 5 కిలో మీటర్ల పరుగు పందెంలో నాలుగవ స్థానం, 1500మీటర్ల పరుగు పందెంలో ఐదవ స్థానం సాధించాడు. 55ఏళ్ళ వయసులో జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు సాధించడం గర్వకారణమని తోటి ఉద్యోగులు పేర్కొన్నారు. హెడ్‌ఓవర్‌మెన్లు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు తిరుపతిరావు, గడ్డం తిరుపతి, వేణుగోపాల్, సత్యారావు, సత్యం, విజయ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్జీ-2 జీఎంకు వినతిపత్రం ఇస్తున్న సీఎంఓఏఐ సభ్యులు

అధికారులపై చర్యలను నిరసిస్తూ ఆందోళన

యైటింక్లయన్‌కాలనీ, మార్చి 19: మందమర్రి ఏరియాకు చెందిన ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ ఆర్జీ-2 ఏరియా కోలమైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇండియా(సీఎంఓఏఐ) మంగళవారం ఆందోళన చేపట్టారు. జీఎం కార్యాలయంలో జీఎం సూర్యనారాయణను కలిసి వినతిపత్రా న్ని అందజేశారు. ఈసందర్భంగా ఏరియా సీఎంఓఏఐ అధ్యక్షుడు మధుసూద న్ మాట్లాడారు. ఈనెల 16న కాసిపేట-2 ఇంక్లయిన్‌లో జరిగిన ప్రమాదం జరగగా, ప్రమాదానికి బాధ్యుడిని చేస్తూ ఫైడేశ్వర్‌కు చార్జ్‌మెమో ఇవ్వడం, శశిధర్ విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రమాదంపై శాఖాపరమైన దర్యాప్తుచేయకుండా, డీజీఎంఎస్ విచారణ జరపకుండా అధికారులను బాధ్యులు చేస్తూ క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. వెంటనే చార్జ్‌మెమో, సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రామగిరి, మార్చి 19: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బి-జోన్ క్రికెట్ పోటీల ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు సింగరేణి సహకరం ఉంటుందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు దుర్గారావ్, సతీష్ పింగిళి కృష్ణారెడ్డి, సునీల్, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్న ఆర్కే5 గని

శ్రీరాంపూర్, మార్చి 19: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే5 గని 2023-24 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ముందుగానే చేరుకుంది. ఈనెల31లోగా 2లక్షల 70వేల టన్నుల బొగ్గును వెలికితీయాల్సి ఉంది. 11రోజులు మిగిలి ఉండగానే మంగళవారం నాటికే 100శాతం ఉత్పత్తిని సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.